సాక్షి వికారాబాద్

శుక్రవారం । 12 । మే । 2023



ఊరూరా గుట్కా దందా

జిల్లాలో గుట్కా దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వం వీటిని నిషేధించినా.. విచ్చలవిడిగా విక్రయాయిస్తున్నారు. 10లో▸



పాత కక్షలతో కారు ధ్వంసం..

పాత కక్షలతో కారును తగుల బెట్టడంతో పాటు ఎద్దుకు విషం పెట్టి చంపిన ఘటన ఎన్కెపల్లిలో చోటు చేసుకుంది. 10లో▸



జీతాల పెంపుభారం జీపీలపైనే

పంచాయతీ కార్మికులకు పెంచిన.. వేతన భారం జీపీలపైనే పడుతోంది. జీఓ జారీతోనే ప్రభుత్వం చేతులు దులుపుకొంది. 11లో▸

న్యూస్‌రీల్

ఉమెన్ పీఎస్ సీఐకి ఉత్కృష్ట అవార్డు



సీఐ ప్రమీలను అభినందిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: హోంమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా బుధవారం పోలీస్ ఉత్కృష్ట అవార్డు అందుకున్న ఉమెన్ పీఎస్ సీఐ ప్రమీల గురువారం మర్యాద పూర్వకంగా ఎస్పీ కోటిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆమెను అభినందించి, సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళా పోలీస్‌స్టేషన్ అందిస్తున్న సేవలకు గాను సీఐకి కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కడం సంతోషంగా ఉందన్నారు. కష్టపడి పనిచేసే అధికారులు, సిబ్బందికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

గడ్డమీది గంగారంలో బొడ్రాయి పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: మండల పరిధిలోని గడ్డమీది గంగారంలో నిర్వహించిన బొడ్రాయి వేడుకల్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. హోమం, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమర్‌నాథ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు వెంకటయ్య, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయుడి విగ్రహం చోరీ

- జినుగుర్తిలో ఘటన
- వివరాలు సేకరించిన కరన్‌కోట్ పోలీసులు



విగ్రహం స్థలంలో రాగి చెంబు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద దత్తాత్రేయ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గురువారం వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. జినుగుర్తి గేటు వద్ద ఆది బసవన్న ఆలయం ఉంది. గుడి ఆవరణలోని రావి చెట్టు కింద రెండేళ్ల క్రితం పాలరాతి దత్తాత్రేయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దుండగులు ఈ విగ్రహాన్ని పెకిలించి, ఆ స్థానంలో రాగి చెంబు పెట్టి వెళ్లడం కలకలం రేపింది. విషయం తెలుసుకున్న కరన్‌కోట్ ఎస్ఐ- 2 విమల అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. విగ్రహం చోరీకి గురవడంపై ఆలయ చైర్మన్ వీరేశం, స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే జినుగుర్తి గేటు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: మహిళా సాధికారత జిల్లా కేంద్రంలో కాంట్రాక్టు ప్రాతిపదికన కింద సూచించిన ఉద్యోగ నియామకాలకు అర్హులైన స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్- 1, జెండర్ స్పెషలిస్టు- 2, ఫైనాన్షియల్ లిటరసీ స్పెషలిస్ట్- 1, అకౌంట్స్ అసిస్టెంట్- 1, మల్టీ టాస్కిస్ స్టాఫ్-1 పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 26 లోపు కలెక్టరేట్‌లోని రూం నంబర్ ఎస్- 9లో అందజేయాలన్నారు. వివరాలకు 98661 68198, 9849672296లో సంప్రదించాలని సూచించారు.

రాములోరి తలంబ్రాల బుకింగ్‌లో వికారాబాద్ ఫస్ట్

అనంతగిరి: భద్రాచలం శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్‌లో వికారాబాద్ ఆర్టీసీ డిపో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని డీఎం భిక్షనాయక్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హకీంపేట ఆర్టీసీ శిక్షణ కేంద్రంలో ఇటీవల జరిగిన సమావేశంలో లాజిస్టిక్ బిజినెస్ హెడ్ సంతోష్, డిప్యూటీ సీటీఎం గిరిమహేశ్, ఏటీఎం రవీందర్ రవీందర్‌ల చేతుల మీదుగా వికారాబాద్ లాజిస్టిక్ ఎగ్జిక్యూటీవ్ వసంత్‌గౌడ్‌ను సన్మానించారు. 6,264 బుకింగ్స్‌తో వికారాబాద్ డిపో వరుసగా రెండు సార్లు మొదటి స్థానంలో నిలిచిందన్నారు. తలంబ్రాలు బుక్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఉగ్ర అలజడి!



పచ్చదనం, ప్రశాంతత, ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణానికి నెలవైన అనంతగిరి కొండల్లో ఉగ్రమూకల శిక్షణ కలకలం రేపుతోంది. గతంలోనూ పలుమార్లు ఇలాంటి సంఘటనలు వెలుగు చూడగా.. ప్రస్తుతం హిజ్బ్ ఉత్ తెహ్రీర్ సంస్థ సభ్యులు ఇక్కడ ట్రైనింగ్ పొందారనే వార్తలు జిల్లా ప్రజలను కలవరానికి గురిచేస్తున్నాయి.

ఉగ్రమూకల శిక్షణ కేంద్రంగా అనంతగిరి అడవులు

- గతంలోనూ సిమి కార్యకలాపాలు
- తాజాగా హెచ్‌యూటీ సంస్థ సభ్యులకు ట్రైనింగ్
- హైదరాబాద్ నిఘా వర్గాల సోదాల్లో వెల్లడైన వాస్తవాలు
- ఆందోళనలో జిల్లా వాసులు
- నిఘా పెంచాలని డిమాండ్

వికారాబాద్: గతంలో సిమి(ఉగ్రవాద సంస్థ) కార్యకలాపాలకు అడ్డాగా మారిన అనంతగిరి అడవులను తాజాగా మరో ఉగ్ర సంస్థ తమ సభ్యుల శిక్షణ కోసం ఎంచుకుంది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న అనంతగిరులు పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో.. ఉగ్రమూకలకు శిక్షణ కేంద్రంగా మారిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు రోజుల క్రితం మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు రాష్ట్ర నిఘావర్గాలతో కలిసి హైదరాబాద్‌లో జరిపిన సోదాల్లో (హెచ్‌యూటీ) హిజ్బ్ ఉత్ తెహ్రీర్ సంస్థ కార్యకలాపాలను గుర్తించిన విషయం తెలిసిందే. ఈ సంస్థ ఆధ్వర్యంలో కొందరు యువకులకు ఇక్కడ శిక్షణ ఇచ్చినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఇందుకోసం అనంతగిరి అడవులను ఎంచుకున్నట్లు విచారణలో బయటపడింది. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న అనంతగిరి అడవులు తరచూ ఏదో ఒక ఉగ్రవాద సంస్థకు స్థావరంగా మారడం విమర్శలకు తావిస్తోంది. మన నిఘా వ్యవస్థలు ఏం చేస్తున్నాయనే అనుమానం కలుగుతోంది.

అనుకూల పరిస్థితులు

దట్టమైన అటవీ ప్రాంతం, గుట్టలు, ట్రెక్కింగ్‌కు వీలున్న ప్రదేశాలతో పాటు గంటలోపు నగరానికి చేరుకునే అవకాశం ఉండటంతో ఉగ్ర మూకలు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. సుమారు ఎనిమిది మంది హెచ్‌యూటీ సభ్యులు ఇక్కడ ట్రైనింగ్ పొందినట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా ఎయిర్ గన్ షూ టింగ్, ట్రెక్కింగ్, సర్వైవల్ టెక్నిక్స్, మరియు ఫిజి కల్ ఫిట్నెస్ అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిసింది.

ఎక్కడున్నారు..?

గతంలో సిమి ఉగ్రవాదులు వికారాబాద్‌లోని రిక్షా కాలనీలో ఉండి అనంతగిరిలో శిక్షణ తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఇక్కడ ట్రైనింగ్ పొందినవారితోపాటు శిక్షణ ఇచ్చిన వారు హైదరాబాద్ కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం ఇక్కడికి వచ్చి వెళ్లారా..?లేక ఇక్కడే ఏదైనా గ్రామం లేదా కాలనీలో తల దాచుకున్నారా..?వీరికి స్థానికులు ఎవరైనా సహకరించారా..?అనే విషయాలు తేలాల్సి ఉంది.

పక్కనే ఉంటూ..

గతంలోనూ పలుమార్లు అనంతగిరి కొండలు ఉగ్ర కలాపాలకు అడ్డాగా మారినట్లు తేలింది. ప్రధానంగా సిమి ఉగ్రవాద సంస్థ సభ్యులు ఇక్కడే ట్రైనింగ్ పొందిన విషయం బహిర్గతమైంది. వికారాబాద్‌లోని రిక్షా కాలనీలో ఉంటూ అడవుల్లో శిక్షణ పొందినట్లు అప్పట్లో పోలీసులు గుర్తించారు. వీరంతా అనంతగిరి చుట్టు పక్కల గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో మత బోధకుల ముసుగులో ఆశ్రయం పొందినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన జిల్లా పోలీసులు అనంతగిరులతో పాటు ఆయా గ్రామాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెంచారు. అయితే సుదూర ప్రాంతాల్లో ఉన్న అడవులను ఎంచుకుంటే అనుమానం వస్తుందనే కారణంతో.. పర్యాటకుల వేషధారణలో తమ కార్యకలాపాలు సాగించవచ్చనే ఉద్దేశంతోనే ఉగ్రవాదులు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు భావిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇటు ఫారెస్టు అధికారులు, అటు పోలీసులకు తెలియకపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అనంతగిరి అడవుల్లో నిఘా పెంచాల్సిన బాధ్యతను గుర్తు చేస్తున్నారు.



ఫిర్యాదు చేయాలి



ఉగ్రవాద ముఠా సభ్యులకు అనంతగిరి కొండల్లో శిక్షణ ఇచ్చారనే విషయం మా దృష్టికి కూడా వచ్చింది. కానీ ఎప్పుడు, ఎక్కడ ట్రైనింగ్ తీసుకున్నారనే పక్కా సమాచారం అందలేదు. ఇవి నిరాధార ఆరోపణలే.. ఎవరివద్దయినా సాక్ష్యాధారాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రజల్లో భయభ్రాంతులు కలిగించొద్దు.

– ఎస్.కోటిరెడ్డి, ఎస్పీ

పారదర్శకంగా అర్హుల ఎంపిక

- డబుల్ బెడ్రూం కేటాయింపుల్లో అవకతవకలకు తావీయొద్దు
- ఆర్డీఓలు, తహసీల్దార్లకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- 20లోపు లబ్ధిదారుల జాబితా అందజేయాలని సూచన



కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని, ఇందుకు సంబంధించిన తుది జాబితాను ఈనెల 20 వరకు అందజేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్హుల ఎంపికలో పాటించాల్సిన నిబంధనలపై సలహాలు, సూచనలు అందించారు. ఇల్లు, భూమిలేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కనీసం 20శాతం మంది అతి నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాతే.. లాటరీ విధానంలో మిగితా వారిని సెలెక్ట్ చేయాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యేలను భాగస్వాములు చేసి, వారి సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల జాబితా తయారీలో ఎలాంటి అవకతవకలకు తావీయకూడదని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్డీఓలు విజయకుమారి, అశోక్ కుమార్‌తో పాటు తాండూరు, పరిగి, కొడంగల్, మర్పల్లి, ధారూరు, చౌడాపూర్ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

తాండూరు కాంగ్రెస్ అభ్యర్థిని నేనే

- మరోసారి బీఆర్‌ఎస్‌ను ఓడించి తీరుతాం
- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్

తాండూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనే దమ్ము కాంగ్రెస్ పార్టీకి ఉందని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. మండల పరిధిలోని మిట్టబాసుపల్లిలో గురువారం ఓ శుభకార్యానికి హాజరైన ఆయన అనంతరం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాండూరు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని తానేనని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిలో టికెట్ ఎవరు తెచ్చుకున్నా.. కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో తమ పార్టీ చాలా బలంగా ఉందని, గత ఎన్నికల్లోనూ ఇక్కడ తామే గెలిచామని, బీఆర్‌ఎస్‌ను మరోసారి ఓడించి తీరుతామని ప్రకటించారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం దాదాపు ఖరారైందని, తెలంగాణలో కూడా అధికారం తమ పార్టీదేనని స్పష్టంచేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, నరహరి, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్ పటేల్, బత్తుల రాజు, లొంక నర్సింలు తదితరులు ఉన్నారు.



మిట్టబాసుపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలతో రమేశ్ మహరాజ్

గింజ రాలదు.. నేల వాలదు

- అందుబాటులో జేజీఎల్ 24423, జగిత్యాల రైస్- 1 రకాలు
- యాసంగి సీజన్‌లో 400 ఎకరాల్లో సాగు
- మిగతా వంటలతో పోలిస్తే అధిక అనుకూలతలు
- వర్షాకాలంలోనూ విత్తుకునే అవకాశం



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు: అకాల వర్షాలు అన్నదాతలను నిండా ముంచాయి. రాళ్ల వానలతో వరి పంటలు ధ్వంసమయ్యాయి. కనీవినీ ఎరగని రీతిలో ఈసారి జిల్లాలో కురిసిన వడగళ్లు తీరని నష్టం మిగిల్చాయి. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకోగలిగే రకాల విత్తనాలను వాడితే ఎలాంటి సమస్య ఉండదని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. జగిత్యాల పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సృష్టించిన జేజీఎల్- 24423 వంగడాలు భారీ వర్షాలతో పాటు వడగళ్ల వానను బాగా తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో పలువురు రైతులు సాగు చేసిన ఈరకం పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. ధాన్యం రాలడం, పంట నేలకొరగడం వంటివి జరగలేదు.

పెరిగిన నీటి లభ్యత

జిల్లాలో నీటి లభ్యత పెరగడంతో యాసంగిలో వరి సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఇటీవల చోటుచేసుకున్న వాతవరణ పరిస్థితులు, అకాల వర్షాలు, వడగళ్లకు పలు ప్రాంతాలో వరి రైతులకు నష్టం జరిగింది. గింజలు రాలి పోవడంతో పాటు ఈదురు గాలులకు చేలు నేలవాలాయి.

పంటల పరిశీలన

యాలాల మండలంలో రైతులు సాగు చేసిన జేజీఎల్- 24423 రకం పంటలను తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. భారీ వర్షాలకు సైతం గింజ రాలలేదని గుర్తించారు. ఈ రకం వంగడాలను యాసంగితో పాటు వర్షాకాలంలోనూ విత్తుకోవచ్చని తెలిపారు. దిగుబడి సైతం బాగా వస్తుందన్నారు. విత్తన ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సుమారు 400 ఎకరాల్లో ఈరకం పంటలు సాగయ్యాయని స్పష్టం చేశారు. ఈసారి మరింత పెరిగే అవకాశం ఉంది.

30- 35 క్వింటాళ్ల దిగుబడి

యాలాల మండలంలోని కిష్టాపూర్ రైతులు స్వల్పకాలిక రకమైన విత్తనాలను తక్కువ రాలే గుణం ఉన్న జగిత్యాల రైస్- 1, జేజీఎల్- 24423 రకాలను ఎక్కువగా సాగు చేశారు. మన జిల్లాలో దొడ్డు రకమైన 1010 విత్తనాలతో వరి పంటలు సాగు చేస్తారు. దీనితో పోలిస్తే జగిత్యాల రైస్- 1 రకం పంటలు అకాల వర్షాలు, వడగళ్లను బాగా తట్టుకున్నాయని అధికారులు గుర్తించారు. 125 రోజుల వ్యవధిలో కోతకు రావడంతో పాటు, తక్కువ గింజలు రాలే గుణం, ఎకరాకు 30- 35 క్వింటాళ్ల దిగుబడిని వస్తోందని చెబుతున్నారు.

తెలంగాణ వచ్చాకే పండుగలకు ప్రాధాన్యత

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



పూజా కార్యక్రమాల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

షాద్‌నగర్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాకే పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకొంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ 'తీన్మార్'!

- ఐదేళ్లలో ముగ్గురికి అవకాశం
- వంతులవారీగా పదవిని అలంకరిస్తున్న నేతలు
- నేడు మూడో వ్యక్తి ఎన్నిక



బొంరాస్‌పేట: పూర్వం రాచరిక పాలనలో మహారాజులు రాజ్యాలు పంచుకొని పాలించేవారు. రాజ్య విస్తరణ కోసం అవసరమైతే దండయాత్రలు చేసేవారని తెలుసు. అయితే స్వాతంత్ర్యం సిద్ధించి, ప్రజాసామ్య పాలన అమలులోకి వచ్చిన తర్వాత.. పదవిని పంచుకుని, పాలించే రోజులు వచ్చాయి. జిల్లాలోని బొంరాస్‌పేట మండల ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) పదవిని వంతులవారీగా పంచుకుని.. పదవీ కాలాన్ని పూర్తి చేసుకునే ఒప్పందం కొనసాగుతోంది. ఈమేరకు శుక్రవారం మండలంలో వైస్ ఎంపీపీ పదవికి ఎన్నిక జరగనుంది.

ముందే అగ్రిమెంట్

ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలున్నాయి. 2019 మే 6న జరిగిన మండల ప్రాదేశిక ఎన్నికల్లో చిల్మల్‌మైలారం, కొత్తూరు మినహా మిగిలిన 13 ఎంపీటీసీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో బురాన్‌పూర్‌కు చెందిన ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, విదేశీ విద్యనభ్యసించిన చౌదర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు శేరినారాయణరెడ్డి పోటీ పడగా.. 2019 మే 26న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శేరి నారాయణరెడ్డి మొదటి రెండున్నర ఏళ్ల పదవికాలానికి వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన రెండున్నర ఏళ్ల పదవీ కాలానికి సుదర్శన్‌రెడ్డిని ఎంచుకున్నారు. అనుకున్న ప్రకారమే వైస్ ఎంపీపీగా ఉన్న శేరి నారాయణరెడ్డి ఏడాది క్రితమే రాజీనామా చేశారు. దీంతో మిగిలిన రెండున్నరేళ్ల పదవీకాలానికి పోటీ నెలకొంది. మొదటిసారి వైస్ ఎంపీపీని ఎన్నుకున్న ప్రక్రియలో భాగంగానే రెండో అర్ధభాగం పదవిని అలంకరించేందుకు సుదర్శన్‌రెడ్డి సిద్ధమయ్యారు. ఈ సమయంలో.. మండల కేంద్రం, సామాజికవర్గం కారణాలతో మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు శ్రావణ్‌కుమార్‌గౌడ్ పదవికి పోటీ పడ్డారు. దీంతో ఏడాది క్రితమే సమావేశమైన ఎంపీటీసీ సభ్యులు.. మొదటి ఏడాది పాటు సుదర్శన్‌రెడ్డికి, మిగిలిన కాలాన్ని బీసీ సామాజికవర్గానికి చెందిన శ్రావణ్‌కు ఇవ్వాలని నిర్ణయించారు. 2022 మార్చి 26న వైస్ ఎంపీపీ పదవిని అలంకరించిన సుదర్శన్‌రెడ్డి గత మార్చి 13న తన పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి అధికారిక అనుమతి వచ్చే వరకు ఆపద్ధర్మ వైస్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఇక మిగిలింది శ్రావణ్‌కుమార్‌గౌడ్ వంతే కావడంతో పదవిపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. ఈ మేరకు శుక్రవారం వైస్ ఎంపీపీ ఎన్నిక జరగవచ్చని తెలుస్తోంది. ఇదే నిజమైతే ఉమ్మడి బొంరాస్‌పేట మండల ఉపాధ్యక్ష పదవిని ఐదేళ్లలో ముగ్గురు అనుభవించిన చరిత్ర ఆవిష్కృతమవుతుంది.

కో'ఆప్షన్' కూడా..

మండల కోఆప్షన్ సభ్యులుగా తుంకిమెట్లకు చెందిన జలీల్‌పాషా రెండున్నర ఏళ్లు పనిచేయగా ఆయన స్థానంలో మిగిలిన రెండున్నర ఏళ్ల పదవికాలానికి బొంరాస్‌పేటకు చెందిన మైనొద్దీన్ కొనసాగుతున్నారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

ఇదివరకు వైస్‌ఎంపీపీగా ఉన్న బురాన్‌పూర్ ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి రాజీనామా చేయడంతో అధికారుల ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఎన్నిక జరుగుతుందని ఎంపీడీఓ పాండు నాయక్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరై ఎన్నికను సజావుగా నిర్వహించి, విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలంలో అపస్మారక స్థితిలో క్షతగాత్రులు

కొడంగల్ రూరల్: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన ఘటన పట్టణశివారులో గురువారం రాత్రి చోటుచేసుకొంది. దౌల్తాబాద్ మండలం సాగారంతండాకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను తాండూరు ఆస్పత్రికి తరలించారు. బాధితులు అపస్మారక స్థితిలో ఉండడంతో వారి వివరాలు తెలియలేదని, సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

మర్పల్లి: ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కోట్‌మర్పల్లిలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వీరినుంచి రూ.36,040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వింత వ్యాధితో మూగజీవాల మృత్యువాత

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హుస్నే స్నాబాద్‌లో వింత వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలో నాలుగు దూడలు మృతిచెందినట్లు తెలిపారు. విషయాన్ని పశువైద్యాధికారులకు తెలిపినా స్పందించడంలేదని వాపోతున్నారు. గ్రామంలో ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి మూగజీవాలను కాపాడాలని రవి, అంజిల్‌రెడ్డి తదితర రైతులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

కొడంగల్ రూరల్: రహదారి నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చిట్లపల్లి గేటు దగ్గర ఎన్‌హెచ్ 163 రహదారి వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు వాహనానికి తప్పకుండా రేడియం స్టిక్కర్లు ఉండేట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలం గుర్రంగూడలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాలకు మైనారిటీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 12 నుంచి 20 తేదీ వరకు గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 83095 40774, 99665 33665 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంట్లో చోరీ

శంకర్‌పల్లి: ఇంటి తాళం పగుల గొట్టి బంగారు నగలు, నగదును అపహరించుకుపోయిన ఘటన రామంతాపురంలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ ప్రసన్న కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామంతపురానికి చెందిన కుమార్ అనే వ్యక్తి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. తిరిగి రాత్రి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, నగదు, సెల్ ఫోన్‌ను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఊరూరా గుట్కా దందా



కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలో పట్టుబడ్డ గుట్కా (ఫైల్)

- పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో విక్రయాలు
- సరిహద్దు ప్రాంతాల నుంచి యథేచ్ఛగా సరఫరా
- నామ్‌కేవాస్తేగా పోలీసుల తనిఖీలు

పరిగి: జిల్లాలో గుట్కా దందా గుట్టుగా జరుగుతోంది. ప్రభుత్వం నిషేధించినా విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతూనే ఉన్నాయి. అక్రమార్కులు పట్టణం, పల్లెలు అనే తేడా లేకుండా కిరాణం షాపులు, పాన్ డబ్బాలు, ఇతర దుకాణాలకు వాటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతంగా ఉండటంతో పెద్ద ఎత్తున గుట్కా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున గోదాముల్లో నిల్వ ఉంచి దర్జాగా వ్యాపారం సాగిస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పోలీసుల దాడుల్లో పాత్రదారులు పట్టుబడుతుండగా అసలైన సూత్రధారులు మాత్రం దొరకడం లేదు.

శివారు ప్రాంతాలే అడ్డాలుగా..

కర్ణాటక, మహారాష్ట్రల నుంచి దిగుమతి చేసుకున్న నిషేధిత గుట్కాలను ఎవరికీ అనుమానం రాకుండా శివారు ప్రాంతాల్లో నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం. దుకాణాల్లో నిల్వ ఉంచితే పట్టుబడే అవకాశం ఉండటంతో ఇలా చేస్తున్నారు. నిల్వ ఉంచిన ప్రాదేశం నుంచి అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో గ్రామాలకు తరలిస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో గుట్కాపై నిషేధం లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపులేకుండా పోతోంది.

గొలుసుకట్టులా దందా

గుట్కా మాఫియా తీరును చూస్తే చైన్ సిస్టంలా నడుస్తోంది. అడుగు భాగంలో గుట్కాలను వేసి పైన నిత్యావసర సరకులు వేసి దర్జాగా తరలిస్తున్నారు. గుట్కాలను తీసుకువచ్చిన వ్యక్తి నుంచి మరో దళారి కొనుగోలు చేస్తాడు. ఆ దళారి మండలం, గ్రామాల వారీగా ఏజెంట్లను పెట్టుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా అన్నిగ్రామాల్లో నిషేధిత గుట్కాలను దర్జాగా అమ్ముతున్నారు. గుట్కా వ్యాపారం చేస్తున్న వారు పోలీసులకు పెద్ద ఎత్తున మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. గుట్కాల తరలింపులో పోలీసులే సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. దుకాణాల్లో, పాన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్నాం. నిషేధిత వస్తులు విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం. ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేసి సోదాలు చేస్తున్నాం. ఎక్కడైనా– నిషేధిత గుట్కాలు, తదితర వస్తువులు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

– వెంకటరామయ్య, పరిగి సీఐ



వివరాలు సేకరిస్తున్న సీఐ అప్పయ్య

పాత కక్షలతో కారు ధ్వంసం.. ఎద్దుకు విషం

- ఎన్కెపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

బంట్వారం: పాత కక్షలతో కారును తగుల బెట్టడంతో పాటు ఎద్దుకు విషం పెట్టి చంపేశారు. ఈ ఘటన గురువారం కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లిలో చోటు చేసుకుంది. ధారూరు సీఐ అప్పయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్కెపల్లికి చెందిన పి.ప్రభాకర్‌రెడ్డి తన సోదరి మమతను 15 ఏళ్ల కిందట నాగసాన్‌పల్లి మోహన్‌రెడ్డితో వివాహం జరిపించారు. మోహన్‌రెడ్డి నిత్యం మద్యం సేవిస్తూ భార్య పిల్లలను చాలా కాలంగా వేధిస్తున్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేక మమత పిల్లలతో సహ పుట్టింట్లోనే ఉండేది. గతంలో చాలా సార్లు పంచాయతీ జరగడంతో మమత మళ్లీ నాగసాన్‌పల్లికి వెళ్లింది. అయినప్పటికీ మోహన్‌రెడ్డి తీరు మారకపోవడంతో మమత తిరిగి పుట్టింటికి వచ్చింది. దీంతో మోహన్‌రెడ్డి అత్తగారింటిపై పగ పెంచుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి ఎన్కెపల్లికి వచ్చి ఇంటి ముందు నిలిపిన కారును తగులబెట్టాడు. పశువుల పాకలో ఎద్దుకు జొన్న రొట్టెలో విషం కలిపి తినిపించాడు. తెల్లవారే సరికి మూగజీవి మృతిచెందింది. కారు తగల బడే సమయంలో పెద్ద శబ్దానికి ప్రభాకర్‌రెడ్డి కుటుంబీకులు బయటికి వెళ్లి చూశారు. అప్పటికే నష్టం జరిగిపోయింది. వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారమిచ్చారు. బాధితుడు ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అప్పయ్య తెలిపారు.



ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కేసీఆర్ పాలనలోనే ప్రగతి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్
- కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌కు ఎంపీటీసీ దిద్దెల కిష్టమ్మ తన అనుచరులతో కలిసి గురువారం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్గనమోని రవీందర్ యాదవ్, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, జంగయ్య, యూసుఫ్, గాలయ్య, రాములు, జంగయ్య, రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ లేకపాయె.. సహకారం అందదాయె

- కూరగాయల సాగుకు ప్రోత్సాహం కరువు
- రైతులకు తప్పని అవస్థలు
- పాలకులకు పట్టని గోస



గడ్డమల్లయ్యగూడలో కర్రల పందిరిపై బీర సాగు

యాచారం: కూరగాయల సాగుకు ప్రోత్సాహం కరువైంది. స్వల్పకాల వ్యవధిలోనే పంటల దిగుబడి తీసి లాభాలు పొందవచ్చని అధికారులు చెప్పడమేకానీ ఏ మేలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. మహానగరానికి దగ్గరగా ఉన్న యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల్ తదితర మండలాల్లో వందలాది మంది రైతులు కూరగాయలను పండిస్తున్నారు. డివిజన్‌లో దాదాపు 10 వేల ఎకరాల్లో సుమారు 5 వేల మంది రైతులు కూరగాయలను పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మాదన్నపేట, సరూరునగర్, వనస్థలిపురం మార్కెట్‌లు సమీపంలోనే ఉండటంతో రైతులు కూరగాయలను తరలించి విక్రయిస్తున్నారు. ఒక్కో రైతు ప్రతి నెలా రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారు. యాచారం మండలం మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి, చింతుల్ల, మంచాల మండలం ఆరుట్ల, జాపాల, మంచాల, తిప్పాయిగూడ, చిత్తాపూర్, ఇబ్రహీంపట్నం మండలం కప్పాడు, కర్ణగూడ, ఎలిమినేడు, పోచారం తదితర గ్రామాల్లోని రైతులు అత్యధికంగా కూరగాయల పంటలు పండిస్తున్నారు.

ఏటా రూ.2కోట్ల విత్తన కొనుగోళ్లు

ప్రత్యేక రాష్ట్రంలో రాయితీలపై విత్తనాలు లేవు. యంత్ర సామగ్రి లేదు. వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉండటం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే కరువు ప్రాంతంగా ఇబ్రహీంపట్నం డివిజన్ పేరు పొందింది. భూగర్భజలాల కొరత దృష్ట్యా రైతులు నాటి నుంచి నేటి వరకు కూరగాయల పంటల సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. నాణ్యమైన విత్తనాల కొనుగోలు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. యేటా దాదాపు రూ. 2 కోట్లకు పైగానే పలు రకాల విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. టమాటా, మిర్చి, వంకాయ, చిక్కుడు, బెండకాయ, దోస, దొండ, సోర, బీర తదితర కూరగాయల పంటలను పండిస్తారు. నాణ్యమైన విత్తనాలు విత్తితే పంట బాగా వచ్చి దిగుబడి కలిసొస్తుందనే నమ్మకంతో రూ.వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మండల కేంద్రాల్లోనే రాయితీలపై విత్తనాల ప్యాకెట్లు విక్రయించే వారు.

కేవలం నారేనట..

సర్కార్ నారును మాత్రమే రాయితీపై అందజేస్తోంది. టమాటా, మిర్చి, వంకాయ పంటల నారునే రాయితీపై అందజేస్తున్నారు. నారును 20 పైసల కొక మొక్క చొప్పున ప్రతి రైతుకు కేవలం 5 ఎకరాల వరకు 50 శాతం రాయితీపై అందజేస్తున్నారు. రైతులు జీడిమెట్లల్లో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఖర్చులు, దూరభారమవుతుండటంతో రైతులు అంతగా ఆసక్తి చూపడంలేదు. ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారులు మండలాల్లోనే విక్రయించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడులే అధికం



పుదీనా పంటను సాగు చేస్తున్నాం. అర ఎకరా పొలంలో పంటను సాగు చేయడంతో వడగళ్ల కురవడంతో పంట దెబ్బతిన్నది. మరోవైపు పంటకు పురుగు, దోమ పట్టడంతో మందులు చల్లుతున్నాం. ఆదాయం కన్నా పెట్టుబడికే అధికమవుతున్నాయి. కూరగాయల విత్తనాలు రాయితీపై అందజేస్తే ఆ పంటలపై కూడా ఆసక్తి చూపుతాం.

– కె. నందీప్‌రెడ్డి, యువ రైతు, మొండిగౌరెల్లి

రాయితీలు ఇస్తలేరు



ఉమ్మడి రాష్ట్రంలో కూరగాయల విత్తనాలను 50 శాతానికి పైగా రాయితీపై అందజేసేవారు. అది కూడా మండల కేంద్రాల్లోనే దుకాణాలు ప్రారంభించి విక్రయించే వారు. కానీ ప్రస్తుతం రాయితీపై విత్తనాల జాడేలేదు. యంత్రాలు, సాగు పరికరాలు లేవు. వ్యవసాయ పంటలు సాగు చేయాలంటేనే పెట్టుబడి పెద్ద భారంగా మారింది. – కాశమల్ల రాములు, రైతు చౌదర్‌పల్లి

నారే అందిస్తున్నాం



ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రస్తుతం మిర్చి. టమాటా, వంకాయ నార్లు మాత్రమే 50 శాతం రాయితీపై అందజేస్తున్నాం. జీడిమెట్ల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీకి వెళ్లి తెచ్చుకోవాలి. విత్తనాలు, యంత్ర సామగ్రి అందుబాటులో లేవు. రాయితీపై విత్తనాలను మండల కేంద్రాల్లో విక్రయించేలా చూడాలని కోరుతున్నారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.

– కనకలక్ష్మి, ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



సుదర్శనయాగం నిర్వహిస్తున్న భక్తులు



పూజల్లో టీఎస్‌ఎస్‌ఓ అధ్యక్షుడు, తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు రెండో రోజు గురువారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నరసింహశర్మ, మురళీధర్‌శర్మలు మంత్రోచ్చరణల మధ్య మహా సుదర్శన హోమం, ధాన్యధివాసం, అభిషేకం తదితర పూజలు చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ వెంకటేశ్ దంపతులు సుదర్శన యాగంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మినివాస్ హాజరై స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాకారులు భక్తిపాటలతో అలరించారు. 80 మంది భక్తులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తిర్మని నిర్మలాశ్రీశైలంగౌడ్, సర్పంచ్‌లు లలిత, గోపాల్‌నాయక్, రఘుపతి, జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీల మండలాధ్యక్షుడు జోగు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్



- రాచకొండ పోలీసుల వినూత్న కార్యక్రమం 'మార్పు కోసం ముందడుగు'
- పాత నేరస్తులకు కొత్త జీవితం
- సత్ప్రవర్తనతో మెలిగే వారికి ఉపాధి అవకాశాలు
- నిందితుల పిల్లలకు ఉచిత విద్య సదుపాయం
- 1,300 మంది పాత నేరస్తుల ఎంపిక

సాక్షి, సిటీబ్యూరో: నేరస్తులలో పరివర్తన కోసం రాచకొండ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సత్ప్రవర్తనతో మెలిగే పాత నేరస్తులకు కొత్త జీవితాన్ని అందించాలనే లక్ష్యంతో 'మార్పు కోసం ముందడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు నేరస్తుల పిల్లలకు ఉచిత విద్యను అందించనున్నారు. ఈ మేరకు రాచకొండలోని మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, భువనగిరి మూడు జోన్లలో కలిపి 1,300 మంది పాత నేరస్తులను గుర్తించారు. గత ఐదేళ్లుగా వీరి ప్రవర్తన, కుటుంబ నేపథ్యం ఇతరత్రా అంశాల ఆధారంగా వీరిని ఎంపిక చేసి కొత్త జీవితాన్ని అందించనున్నారు.


విద్య, ఉద్యోగ అవకాశాలు..

ఐదారేళ్ల క్రితం తెలిసీతెలియక, క్షణికావేశంలో నేరాలకు పాల్పడిన వారు, సత్ప్రవర్తనతో మెలిగే వారిని ఎంపిక చేసి, వారికి వ్యక్తిత్వ వికాస తరగతులను నిర్వహిస్తారు. నేరాలు చేస్తే సమాజంతో పాటు వ్యక్తిగత కుటుంబానికి ఎలాంటి నష్టాలు, ఇబ్బందులు కలుగుతాయో తెలిపి వారిలో మార్పు తీసుకొస్తారు. నేరస్తులకు ఉద్యోగ అవకాశాల కోసం లయన్స్ క్లబ్ హైదరాబాద్, గ్రీన్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. డ్రైవింగ్, మెకానిక్, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి పలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందుకోసం పలు బహుళ జాతి కంపెనీలతో రాచకొండ పోలీసులు ఒప్పందం చేసుకున్నారు. కనీసం నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేలు గౌరవ వేతనం దక్కేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే నేరాలు మానేసి సత్ప్రవర్తనతో జీవించే నేరస్తుల పిల్లలకు ప్రభుత్వ గురుకుల పాఠశాలు, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను అందించడంతో పాటు, వారికి సీట్లు ఇప్పించి ఉచిత విద్య అందిస్తారు.

నేరస్తులపై నిఘా..

మార్పు కోసం ముందడుగు కార్యక్రమానికి ఎంపిక చేసిన నేరస్తులపై కూడా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారు. నేరస్తుల వేలి ముద్రలను పోలీసు సిస్టమ్‌లో నవీకరిస్తారు. నిందితులు, వారి కుటుంబ సభ్యుల వారి కదలికలపై నిఘా పెడతారు. నేరస్తులను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు వారి ఇళ్లను గూగుల్ లొకేషన్‌లో మ్యాపింగ్ చేస్తారు. వారి మొబైల్ నంబర్లను ట్రేసింగ్ చేస్తుంటారు. ఏమాత్రం చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే అరెస్టు చేసి, జైలుకు పంపిస్తారు.


ఎల్లవేళలా పోలీసుల సహకారం..



సీసీఎస్ పోలీసులు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా పాత నేరస్తులు పరివర్తన చెంది నూతన జీవితాన్ని మొదలుపెట్టడానికి అవకాశం దొరుకుతుంది. సత్ప్రవర్తనతో జీవించే వారికి పోలీసు నుంచి ఎల్లవేళలా సహాయసహకారాలుంటాయి.

– డీఎస్ చౌహాన్, సీపీ, రాచకొండ

ఉచిత న్యాయ సేవలు కూడా



పదేళ్ల వరకు ఎలాంటి నేరాలకు పాల్పడని వారి మీద క్రైమ్ షీట్లు తొలగిస్తాం. గతంలో వారిపై నమోదైన కేసుల విషయంలో అడ్వకేట్లకు భారీగా ఫీజులు చెల్లించే అవసరం లేకుండా అవసరమైన సలహాలు ఇస్తాం. ఉచిత న్యాయ సేవలను అందిస్తున్నాం.

– మధుకర్ స్వామి, డీసీపీ, క్రైమ్స్

పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి



కొందుర్గు: మృతిచెందిన గేదెల కళేబరాల వద్ద రోదిస్తున్న బాధితురాలు

కడ్తాల్: మండల పరిధిలోని చరికొండ గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన తాడిపర్తి యాదయ్యకు చెందిన మూడు గొర్రెలు, బల్వంత్‌రెడ్డికి చెందిన మేక మృత్యువాత పడింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు.

పెద్దఎల్కిచర్లలో రెండు గేదెలు..

కొందుర్గు: పిడుగుపాటుకు రెండు గేదెలు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ శ్రీశైలం గురువారం ఉదయం గేదెలను పొలం వద్ద చెట్టుకు కట్టి ఇంటికి భోజనానికి వచ్చాడు. అదేసమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది.పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. గేదెల విలువ రూ. 60 వేల పైనే ఉంటుందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు



రోడ్డుపై నేలకూలిన చెట్టును తొలగిస్తున్న ప్రయాణికులు

యాచారం: నక్కర్తమేడిపల్లిలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు భయంకరమైన ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. ఈ రోడ్డు వక్షాలు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులే చెట్లను తొలగించారు. గాలులకు మామిడి తోటల్లో మామిడి కాయలు నేల రాలాయి. పలు రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి.